# కథావశిష్టుడు

'అబ్బబ్బ! ఎంతకాలం ఈ చింతకాయ పచ్చడినే వడ్డిస్తూ కూచునేది.... అయినా ఆ పాఠకులు అరగిస్తారుకదా అని ఈ కుళ్ళిపోయిన కథలనే తిరగేసి రుబ్బించి, జల్లించి ఎన్నిసార్లు పదేపదే, ఇదే ఇదే కథల్ని వంచిపెట్టడం?' అని విసుక్కున్నాడు కథకుడు కల్యాణరావు. బాధపడ్డాడు.

బాధ పడ్డంతవరకూ పడి,తర్వాత ఆలోచించడం మొదలుపెట్టాడు.

క్రొత్త కథ రాయాలి.

అంటే, ఈ లోకమెరుగని దానిని తాను సృష్టించ చేస్తాడనికాదు. ఆ విషయం తనకు తెలుసు.

సరిక్రొత్తవిధంగా చెప్పాలి కథను, అదీ తన అభిప్రాయం.

అమ్మాయిలు, అబ్బాయిలు, ప్రేమలు, కలహాలు, రాజీలు, వరకట్నాలు, రెండోపెళ్ళిళ్లు, సవతితల్లులు, డ్యాన్సర్లు, పెయింటర్లు, బరువైన వాక్యాలు, బ్రెకెట్లతో కన్నీళ్ళు-ఇదే మసాలాతో మామూలు వంటకం గాక కొంగ్రొత్తగా చెప్పాలి కథను.

అరిగిపోని వస్తువులు తీసుకుని అలవోకగా, అతినేర్పుగా, నాజూకుగా సున్నితంగా చెప్పాలి కథను-

అన్న నిర్ణయానికి వచ్చాడు కల్యాణరావు.

సరే —పాలసీ అయితే దివ్యంగానేవుంది. గాని, దాన్ని అమలుజరపడం యెట్లా? మొదటిమెట్టు ఏమిటి అని కాసేపు మధనపడ్డాడు కల్యాణరావు.

కథకుడికి కథ దొరికే దెక్కడ? గుంటూరు మెయిన్ రోడ్ మీదనా? కర్నూలు వన్ టౌన్ పోలీస్ స్టేషన్ వద్దనా? లేక మదరాసు పారీస్ కార్నర్ లోనా లేక, మూసీనది ఒడ్డునా?

అక్కడ ఇక్కడ ఎక్కడయినా కథ దొరుకుతుంది. కళ్లూ చెవులూ వున్న కథకుడికి గాలి ఆడినచోటెల్లా కథ లుంటాయి. గాలిలో మాటలో మాటగా మనిషిలో మనిషిగా మెదిలే ఆ కథ అనేదాన్ని - అతి నేర్పుగా పసిగట్టి, పదాలలో పట్టి, పఠితలముందు పెట్టాలి.

అనుకున్న కల్యాణరావు ఆ పనిచేయ నడుము కట్టాడు.

బజార్లు, మురికివాడలు, సినిమాహాళ్ళు - లాటి చోట్లన్నిటిగురించి ఒకదానివెంట ఒకటిగా ఆలోచించి వాటన్నిటినీ తోసిపారేశాడు కల్యాణ రావు. అలా యోచనా తరంగాలమధ్యపడి తేలుతూ మునుగుతూవుండగా కల్యాణరావు బుర్రలో హఠాత్తుగా ఒక రైలింజను కూసింది.

మైగాడ్! వందలకొలది ప్రజలు ప్రతీగంటా నడయాడే రైల్వే స్టేషన్ కన్న ఈ ప్రపంచంలో కథలను దాచుకునేచోటు ఏమిటుంటుంది - అనిపించింది. పడుచుదనం రైలుబండ్లు, ఎక్స్ప్రెస్ లగేజీలు, మనస్సులలోని నేరోగేజీలు, వియోగాలు, సంయోగాలు, లంచాలు, భిక్షలు, ఎయిర్ కండి షన్లు, వేడి బనానీలు-ఓహో బ్రహ్మాండాతి బ్రహ్మాండమయిన సరుకు!! కథకుడిపాలిట కల్పతరువీ రైల్వేస్టేషన్-అనుకున్నాడు కళ్యాణరావు.

ఆ సాయంకాలం ఆఫీసయిపోయాక (మరి ఎందరో తెనుగు కథకు లకు మల్లేనే కళ్యాణరావూ ఏకఆఫీసుకు అంకితమయిన గుమస్తాయే!),గది కెళ్ళి, స్నానంచేసి, బట్టలు మార్చుకుని తొందరగా తిండి ముగించుకుని తొమ్మిదయేసరికల్లా రైల్వేస్టేషను చేరాడు. కళ్యాణరావు. ప్లాట్ఫారం టికొన్నాడు. లోపలికి నడిచాడు.

అపాటికి ఆలస్యంగా వచ్చిన జనతానుండి మద్రాసు జనం దిగు మతి అవుతున్నారు. మరో ఎక్స్ప్రెస్ ఏదో బయలుదేరుతూంది. అవతల

ఓ లైనుమీద షంటింగ్ జరుగుతోంది. ఇంజనుకూత, ప్రయాణీకులకూతలు, పోర్టర్ల మోతలు అతి కోలాహలంగా నవవధువు మనసువలెవున్నది స్టేషన్.

ఈ గందరగోళం అంతటికీ అతీతుడుగా నిల్చుని, ఇదంతా ఇంద్రుడివలె ఒళ్ళంతా కళ్ళుగా పరిశీలిస్తున్నాడు కళ్యాణరావు.

ఉన్నట్లుండి వానజల్లు మొదలయింది.

వండర్ఫుల్–అనుకున్నాడు కళ్యాణరావు. ఇటువంటి చీకటివేళ వానకూడా పడుతుంటే వారేవా! అతి రసవత్తరమయిన ఆల్ఫ్రెడ్ హిచ్కాక్ సినిమాలవంటి కథలు జరుగుతుంటాయి. అటువంటి దొకటి ఈ నాడిక్కడ జరిగితే–ఓహో ఏమదృష్టం! తాను దానిని దగ్గరుండి గమనిస్తాడు.

'అండ్ ఫర్ ది ఫస్ట్ టైమ్ ఇన్ ది హిస్టరీ ఆఫ్ తెలుగూ షార్ట్ స్టోరీస్ మైడియర్ గిరీశం–ఎ రైటర్ వుడ్ హేవ్ పార్టిసిపేటెడ్ ఇన్ ఎ స్టోరీ.... నోట్ దట్! ఎంత విప్లవాత్మకమయిన సంఘటన అవీ....'

క్రమంగా ప్లాట్ఫారం బోసిపోయింది. టీ స్టాల్ 'పవమాన సుతుడూ' ఆలపిస్తూంది ప్లాట్ఫారంమీద పంకాలన్నీ గుడ్–నైట్ చెప్పేశాయి. దీపాలుమాత్రం వెలుగుతున్నాయి. వాటి నారగిద్దామన్న దురాశతో కొన్ని పురుగులు మిడిసిపడుతున్నాయి; మడిసిపోతున్నాయి.

నలిగినా తెల్లగానే వున్న యూనిఫారం వేసుకున్న టి. టి. ఇ. ఒక్కడు అటువచ్చాడు. టిక్కెట్టులేనిబాపతేమోనని అనుమానంగా చూచాడు కళ్యాణరావు కేసి.

అది పసిగట్టిన కళ్యాణరావు అతడిని అడిగాడు. "ఇంతకూ 'కచ్' విషయంలో శాస్త్రిగారుచేసింది రైటేనంటారా?"

ఎంతసేపు ట్రయిన్ టైములు, రైలుఛార్జీలు, రిజర్వేషన్లు, బండి వేళకు వస్తుందా రాదాలు–ఇవే తప్ప కచ్ సమస్యవంటి ముఖ్యవిషయం పై

అతన్నొక మనిషిక్రింద లెక్కకట్టి అభిప్రాయం అడిగినవాళ్ళే లేని ఆ టి. టి. ఇ. కి కల్యాణరావు వేసినప్రశ్న-మహదవకాశమయింది. కల్యాణ రావుని టిక్కట్టడగాలన్న విషయం మరిచిపోయా డతడు.

"అబ్బ: చాల ఇంపార్టెంట్ కొశ్చన్ వేసేశారండీ .... రండి చెబుతా-" అని కల్యాణరావుని చెయ్యిపట్టుకు తీసుకెళ్ళి ఒక బెంచిమీద కూచోపెట్టాడు టి. టి. ఇ.

పోర్టర్ నూరుద్దీన్‌ను కేకేసి రెండు 'చాయ్'లు చెప్పి, టి. టి. ఇ. తన అమూల్యాభిప్రాయాన్ని విశదీకరించ నారంభించాడు.

"అసలు మనదేశ స్వాతంత్ర్యాత్పూర్వమే - ఏది-1947 వ సంవత్సరం ఆగస్టు 15వ తారీఖు పూర్వమే యీ కచ్‌సమస్య వంటిది రాకుండా జాగ్రత్తపడి వుండాలిసార్. అప్పుడేగనుక పాకిస్తాను ఇమ్మనుకొమ్మంటే ఈనాడీ సమస్య తలయెత్తేదా చెప్పండి, అహ: తలా-ఎత్తేదా అని:" ఆమ్రేడితంతో ప్రశ్నార్థకం మిళాయించి, జవాబుకోసం ఆగకుండా — ఆ టి. టి. ఇ. పంతులు ఏకధాటిన వలభై రెండునిముషాల సేపు తన వాగ్ధారలో కల్యాణరావుకు అభిషేకం చేయించాడు.

మధ్య వేడీ వేడి 'చాయ్' తాగినప్పటికీ-కచ్ సమస్యపై టి.టి.ఇ. గారి అంతిమనిర్ణయం వినేసరికి కళ్యాణరావుకు వరసపెట్టి జంట కవల పిల్లలను కన్నంతపనయింది. వెధవ కచ్‌ప్రాంతం అరేబియాసముద్రంలో కలిసిపోతే పోయె - అవతల ఆ చీకటిచాటున- ఆ సిగ్నల్‌చెక్క చుట్టు ప్రక్కల-అమూల గూడ్సుషెడ్‌వద్ద-ఆ లూప్‌లైను ప్రక్కగా దిగాలుగా నిల్చునివున్న రైలుపెట్టెలలోపల ఎన్నికథలు జరిగిపోతున్నాయో ఏమో - అయ్యో అనిపించింది.

చివరకు టి. టి. ఇ. "అయ్యో అదండీ అసలు విషయం....ఇవాళ సరిగా టైము లేకపోయినదిగాపీండి మరొకరోజు సవిస్తరంగా మనవి చేసుకుంటాను" అన్నాడు.

"తప్పకుండాను_"

"మరి మీ రేవిటి ఇంకా కూచున్నారు. డెహ్రాడూన్ ఎక్స్‌ప్రెస్ కోసమా?"

"మరే మా ఆవిడా పిల్లలూరావాలి. అందుకని_" అన్నాడు బ్రహ్మచారి కళ్యాణరావు.

"అదివ్వాళ టైముకే వస్తూంది లెండి?"

"నిజంగానే!"

"విష్ యూ హేపీ అవర్స్" అని నవ్వాడు టి. టి. ఇ. తందామవిపించింది. కళ్యాణరావుకి. టిక్కెట్టేదయినా అడుగుతాడేమోనని భయం వేసింది.

"నేను అదుగో ఆ ఎదుట క్వార్టర్స్ నెంబర్ పధ్నాలుగులో వుంటున్నాను. ఎపుడయినారండి.సరదాగా మాట్లాడుకుందాం" అని ఆహ్వానించాడు.

"ఓ యస్! అంతకన్నానా?" అన్నాడు కళ్యాణరావు.

"వస్తా మరి గుడ్‌నైట్....మీలాంటి 'ఇంటలెక్చువల్ కంపెనీ' అంటే నాకు మహా ఇష్టం" అన్నాడు టి. టి. ఇ.

"ఆ....మీరు మరీను_!" అని నాటకంలో ఆడవేషం వేసినట్లు కులికాడు. కళ్యాణరావు.

"వస్తా_" అని టి. టి. ఇ. వెళ్ళిపోసాగాడు నిజంగానే!!

_అదే చూశాడు కళ్యాణరావు. గభుక్కున ఆ జిగటగాడు మళ్ళీ ఏ కాశ్మీరుగురించో చెప్పడానికి వస్తాడేమో_ఇక్కడే తెల్లవారిపోగలదని భయపడిన కల్యాణరావు అతివేగంగా ఒకటి, రెండు, మూడు నెంబర్లుగల ప్లాట్‌ఫారాలుదాటి నాల్గవదానిని చేరాడు.

వానజల్లు ఆగింది.

కల్యాణరావు ఆ ప్లాట్ ఫారం చివరకు నడిచాడు. ప్లాట్ ఫారం విడిచి, తడిమట్టిమీద నడవసాగాడు. ఇరవై గజాలు వెనక్కి వెళ్లాయి. అక్కడొక నాలుగురైలుపెట్టెలు వరుసగానిల్చివున్నాయి. నలభై గజాలదూరంలో దీపమొక్కటి వెలుతురు ఇవ్వడానికి బెదురుతూనిల్చింది.

కల్యాణరావు బూట్లక్రింద కంకరరాళ్ళు గలగల లాడాయి. ఆత్మ హత్య చేసుకోబోతున్న వాడివలె అరక్షణం రైలుపట్టాలమధ్య ఆగి, ఇటూ అటూచూశాడు. దూరంగావున్న ప్లాట్ ఫారం మినుకుమినుకు మంటున్న దీపాలతో ఏదో చిన్న గ్రామంలాగా వుంది.

తనకు అటూ ఇటూగా మహానగరపు శబ్దాలేవో విన్పిస్తున్నాయి నగరపు నాడీకేంద్రంమీద తాను నిల్చున్నాడు—అన్నభావమే ఏదోవింతగా వుంది. కుడివైపునుంచి ఎర్రటిదీపం ఒకటి ఇటువైపుకు వస్తున్నట్లుంది.

కల్యాణరావు తటాలున అవతల పట్టాలమీదవున్న నాలుగుపెట్టె లలో ఒకదానితలుపు తెరవ యత్నించాడు. అదృష్టం! దానికి తాళంవేయ లేదు. మామూలుగానయితే తాళం వేసివుండాలి కాని ఈ విశాల భారతంలో విద్యుక్తధర్మాన్ని అంత అక్షరాలా పాటిస్తున్నవాడెవడులే. అదీ మనమంచికే అనుకున్నాడు. పెట్టెలోపలికిచేరిన కల్యాణరావు.

అక్కడ—మూర్ఖుడి మనసువలె కొన్ని ప్రభుత్వశాసనాలలో అర్థం వలె—అంతా అంధకారం. వినగా వినగా పిచ్చివాడి ప్రేలాపనలోనే ఒక తీరూతెన్నూ వున్నట్లు రెండునిముషాలయ్యాక, కంటివెనకాతల కండరాలు సద్దుకున్నాక ఆ చీకటిలోనే ఏది యెక్కడవున్నదో లీలగా తెలియ సాగింది. కల్యాణరావు బూట్లువిప్పి పక్కకుంచాడు.

అవతలవైపు తలుపుతోస్తే రాలేదు. దానికి తాళంవేసివుంది. తొంగి చూశాడు. అటురైల్వేలైనుమీద ఒకగూడ్సుబండివున్నది. అటూ యిటూ నిక్కిచూశాడు కల్యాణరావు ఆ గూడ్సుబండికి – గుమాస్తాగారి తీరని కోరికల్లాగున—ఎన్ని పెట్టెలో!

ఈ లోపుగా కీచుమంటూ ఈల ఒకటి విన్పించింది. గభుక్కున వెనక్కువచ్చి, రెండు బెంచీలమధ్య నక్కి కూర్చున్నాడు కల్యాణరావు. అతడి గుండెలచప్పుడూ, బయట బూట్ల చప్పుడూ ఒకటి మార్చి ఒకటిగా వినపడుతున్నాయి.

వాడి జిమ్మడ! ఆ దీపంగాడు గామోసు—సరిగ్గా ఈ పెట్టెదగ్గరికే వచ్చి గుయ్‌మని మళ్ళీ ఈల!

అరక్షణం కల్యాణరావ్ గుండె ఆగింది.

ఆ దీపహస్తుడు తన్ను చూశాడేమో ?

ఆ ఈల రైల్వే పోలీసులను పిలవడానికేమో !

—కల్యాణరావు చొక్కా నరనరాల్లో చెమట ప్రవహించింది.

బూట్ల చప్పుడు వినబడలేదు.

ఈల చప్పుడు మాత్రం వినబడింది కాస్త దూరంగా.

అమ్మయ్య! వాడు దూరంగా వెళ్ళిపోయాడు. వాడు తన్ను చూడలేదు. అయినా, వాడు పోలీసుల్ని పిలిచేట్టయితే ఇంత హంగామాచేస్తాడా? అంతా తన భ్రమ!

నవ్వొచ్చింది కళ్యాణరావుకు.

భయం ఆలోచనా శక్తిని ఎంత నిర్దయతో చంపేస్తుంది!— అనుకున్నాడు.

మళ్ళీ అదే వాక్యం అనుకుని—అబ్బ! ఎంతబ్రహ్మాండమయిన వాక్యం అనేశాను; పెన్సిలుముక్కవుంటే కాగితంమీద నోట్ చేసుకుంటే బాగుండును. రేపు రాయబోయే కథలో ఎక్కడయినా వాడుకోవచ్చును— అన్పించింది.

"శేషగిరోవ్!" అన్నారెవరో కాస్త గట్టిగానే.

కళ్యాణరావు ఆలోచనలన్నీ చచ్చిపోయాయి.

"ఏంది కోటయ్యా?"

"అశేషు బండిలో రాగితీగె ఉన్నాయట."

"అయితే కోటయ్యా! నువ్వాకేబిన్‌దగ్గరకెళ్ళి వాళ్ళ నల్గురినీ తేకేసుకుని అటునుండి రా_నేనిటు చుట్టుకు వస్తాను."

"సరే."

కళ్యాణరావు భయంతగ్గింది. అతడిలోని కథకుడికుతూహలం ఎగిరి గంతులు వేయసాగింది.

ఇంకేముంది. కాస్సేపట్లో ఏదో జరుగుతుంది. తాను దానిని కళ్లార చూస్తాడు. తెనుగు పాఠకుల అదృష్టం పండుతుంది.

నెమ్మదిగా కిటికీదగ్గరచేరి, తలను ఎక్కువగా బయటికి పంప కుండానే పరిస్థితిని తిలకించాడు.

ఆ కోటాయ్, శేషగిరి నాబడు కరటక దమనకులు చెరోవైపూ టకటక నడిచి వెళిపోతున్నారు. వాళ్ళ భుజాలమీదుగా కన్పిస్తున్నవి తోలు పట్టాలా—? అయితే వాళ్ళు రైల్వేపోలీసులా?

రైల్వే పోలీసులూ, రాగితీగెలూ, రాత్రివేళా....అద్భుతం! అత్యద్భుతం!!

కుతూహలం, భయం, ఆందోళన—అన్నీ కలిసి కల్యాణరావు మదిని మథిస్తున్నాయి.

ఎవరయినా వచ్చి తన్ను పట్టుకుంటే! నువ్వెవరవని అడిగితే? ఏం చేస్తున్నావని నిలవేస్తే?

ఓస్....తాను పనిచేస్తున్నది అక్కడా యిక్కడా కాదు, హోం మినిస్ట్రీలో_హుం! తన ఐడెంటిటీకార్డు చూపిస్తాడు. ఇంకా మాట్లాడితే ఆ ఇన్‌స్పెక్టరు వాడెవడో_వాడిముందు తన కథల ఫైళ్ళు పడేస్తాడు. ముఖ్యమంత్రి చేతులనుండి తానొక దీపావళిబహుమతి చెక్కు నందు కుంటున్న ఫొటో వాడి ముఖంమీద విసిరేస్తాడు. ఓహ్! ఇహ అప్పుడు చూడాలి ఆ ఇన్‌స్పెక్టర్ ముఖారవిందం.

ఇంతటి ప్రఖ్యాత కథకుల్ని కలుసుకోవడం చాలఆనందంగావుంది. మా అజ్ఞానాన్ని క్షమించండి. కూర్చోండి. ఓయ్, ఎయిటి టూ! అయ్య గారికి వేడివేడి కాఫీ తీసకురా! అయ్యా, కల్యాణరావుగారూ, మీ సీరి యల్ "అపరంజిబొమ్మ"లో అ హరిజన బాలికవుంది చూశారూ, ఆ పాత్ర నా మనస్సును దోచుకుందిస్మండీ–" అంటాడు అ ఇన్‌స్పెక్టరు. తానేమో భక్తుడికి వరం యివ్వబోతున్నదేవుడి ధోరణిలో–కరుణారసపూరిత మంద హాసం నూరువాట్ల బల్బువలె వెల్గిస్తాడు.

—ధాం! ధాం! ధాం!

గభాలున కూచుండిపోయింది కల్యాణరావు శరీరం. అతడిమనస్సు ఇన్‌స్పెక్టరుగది విడిచి యమస్పీడుతో ప్రస్తుతానికి వచ్చేసింది.

—ధాం! ధాం!!

ఎవరో పరుగెడుతున్నారు. 'కోటాయ్' అని పిల్చినట్లుంది. శేష గిరో లేకపోతే, మరో అశేషగిరో కాబోలు–

రాళ్ళు డబ డబ పడ్డం ఆరంభించాయి.

కల్యాణరావు మనస్సులో మెరుపు!

ఓ యస్–ఇంకేం! అత్యద్భుత బీభత్స భయానకాదిరసపూరిత కథ జరిగిపోతూంది! తనెదురుచూసినట్లే అయింది. దొంగలెవరో కన బడితే.... రైల్వేపోలీసులు....

ధాం!

నెమ్మదిగా కిటికీనుండి తొంగిచూశాడు కల్యాణరావు.

తుపాకులు! రాళ్ళు! చీకటి! చిన్న చిన్న మెరుపులు!

"అయ్య బాబోయ్" అని ఎవరిదో–అరుపు. ఎవరో దభాలునపడిన శబ్దం.

కాని దురదృష్టం, ఇంత రసవత్తరమైన కథా గూడ్సుపెట్టెల కా ప్రక్కన జరిగిపోతుంది. కల్యాణరావు చెవులకే కాని కళ్ళకేమీ

అందడంలేదు. అత నుండబట్టలేకపోయాడు. గూడ్సుబండివైపున్న తలుపుతీస్తే రాలేదు. వెనక్కొచ్చి ఇందాక తాను లోపలికివచ్చిన తలుపుల్ని తీశాడు. ఇటూ, అటూ చూసి గబగబ దిగాడు.

పాదాలకు మట్టి మెత్తగా తగిలింది. కాని కల్యాణరావది గుర్తించలేదు.

ఆ పెట్టె వెనక్కు నడిచాడు. ఆ పెట్టెకు దానివెనక పెట్టెకు, మధ్యవున్న సందుగుండా లైనుదాటాడు. గూడ్సుబండి అతడికి నాలుగయిదడుగులదూరంలో వుంది. ఆ బండిని దాటిమూడాలి. ఇటూ అటూ చూశాడు. గబుక్కున దాట-

బాబోయ్ ! వాడెవడో ఇటే వస్తున్నాడు. చీకటిలోకి నక్కాడు కల్యాణరావు. వాడు తాను దిగిన ఖాళీ పెట్టెలోకే ఎక్కబోతున్నాడు. ఆ తలుపురావడంలేదు. గుద్దుతున్నాడు. ఇదే అదను తానింకా సురక్షితమైన చోటు చేరడానికి-అనుకున్న కల్యాణరావు అతి నెమ్మదిగా నాలుగడుగులు వేశాడు.

ఇటూ అటూ పరుగెత్తుకొచ్చారు ఇంకెవరో - ఎవరో - ఎవరెవరో.

అరక్షణం ఆకాశం బ్రద్దలయింది.

మరుక్షణం కల్యాణరావు 'అమ్మా' అని మూలిగాడు !

మరోరోజు సాయంకాలం.

రైల్వే ఆసుపత్రిలో ఇరవై ఎనిమిదవ 'బెడ్' మీద వున్నాడు కల్యాణరావు. అతడి కుడికాలు ఒక ఉయ్యాలలాటి ఏర్పాటులో పడుకుని వుంది. ఆ కాలిచుట్టూ అడుగుమందాన బ్యాండేజివుంది.

అయిదున్నర ప్రాంతానికి వాళ్ళ ఆఫీసు మేనేజరు సూరిగారు వచ్చారు అతణ్ణి చూడడానికి. ఆయనవెంట ఓ డజనుమంది ఆఫీసుబలగం వున్నారు. వాళ్ళు తెచ్చినపండ్లూ అవీ అక్కడ పెట్టారు.

"పొద్దున్న లక్ష్మణన్ ఇక్కడకు వచ్చాడటగా, చెప్పాడు నాకు. డోన్ట్ వరీ.... ఇంకో రెండు మూడునెలల్లో బాగా నడుస్తావు...." అని అరక్షణం తర్వాత అన్నారు సూరి– "అయినా ఒక్క-కథకోసం ఇంతటి అపాయాన్ని ఎదుర్కొనే నీలాటివాళ్ళను చూచి, తెనుగు సరస్వతి ఎంత గర్విస్తుందనీ!!"

ఇంకా నయం–ఆ రైల్వేపోలీసువాడు దొంగమీదకు పేలిస్తే, గురి తప్పి కాలు విరిగిందిగాని, ఆ పోలీసు గనుక తానే దొంగనుకునివుంటే కథాలేదు కల్యాణరావూ లేడు–అనుకున్నాడు కల్యాణరావు.

బలహీనంగా నవ్వాడు.

('సంస్కృతి' డిసెంబర్–65)